("జ్యోతి" మాసపత్రిక; సెప్టెంబరు 1964)

గతితప్పిన కరుణ

సినిమా పన్నెండు గంటలకే అయిపోయింది. చప్రున కారు బైటికి తీసింది కరుణాదేవి, వ్యాసమూర్తి ఫ్రంట్ సీట్లోనే ఆవిడ కొంచెం దూరంగా కూర్చున్నాడు,

'సినిమా నీకు నచ్చలేదా?'

'అబ్బే, నచ్చిందండీ!—'

'నీకు క్రైమ్ పిక్చర్లంటే ఇష్టం గాబోలు—'

'అవీ యిష్టమేననుకోండి—కాని నే నింగ్లీషు పిక్చర్లెక్కువ చూడను.'

—సాయంకాలం నాలుగున్నరకి ఆఫీసుకి ఫోన్ చేసింది కరుణాదేవి—'చూడు' ఆ ఫర్నిచర్ కంపెనీ ప్రొప్రయిటర్ సికింద్రాబాద్‌లో ఉంటున్నాడ్ట—ఇప్పుడైదింటికివస్తే మాట్లాడొచ్చంటున్నాడు, ఫోన్ చేస్తే. వెళ్ళి మాట్లాడదాం. నువ్వు పర్మిషన్ తీసుకుని బైటి కొచ్చేసి మీ ఆఫీసు గేటు దగ్గిరే నుంచొని నా కోసం చూడు—ఇదుగో, కారు తీసుకు వచ్చెయ్యడమే. నిన్ను అక్కడే పికప్ చేస్తాను. ఆలస్యమా, అయితే కావచ్చు! నువ్వెవరికి జవాబు చెప్పాలోయ్, కుర్రాడా!——అక్కడే తాజ్‌లో భోంచేసి ఏదేనా ఇంగ్లీషు పిక్చరుకి వెడదాం; సిద్ధంగా ఉండు!' అంది—

'పన్నెండు దాటింది. మీ మెయిన్‌గేటు మూసేస్తారు కాబోలు—?'

ఔనండి. కాకపోయినా నేను రూముకి వెళ్ళట్లేదు.'

'ఏం?'

'వరంగల్‌లో నా ఫ్రెండొకడు కాలేజీలో ట్యూటర్‌గా పని చేస్తున్నాడండి. ఈ మధ్యనే పెళ్ళైంది—ఆవిణ్ని తీసుకొని సైట్ సీయింగు కొచ్చాడు, హైదరాబాదు—రూమ్ వాళ్ళ కిచ్చేసి నేను ఫ్రెండ్స్ దగ్గిర కాలక్షేపం చేస్తున్నాను. మొన్నటినుంచీనూ—'

'ఐసీ—' కరుణాదేవి నవ్వింది. 'గుడ్. అలా వుండాలి!'

'నిన్న మా కో్రెయినీ జహీరుద్దీన్ ఇంట్లో పడుకున్నాను. ఇవాళ ఏ.సీ.

షూట్స్‌లో నరిసింగరావింటికి పోతాను – అతను ఫేమిలీని పుట్టింటికి పంపేశాడులెండి'

'ఎబ్సర్డ్. వెళితే వెళ్ళొచ్చుగాని ఈ అర్థరాత్రప్పుడు అతన్ని డిస్టర్బ్ చెయ్యాలా, ఈ భాగ్యానికి–? మా బంగళాకొచ్చి, మా గెస్ట్‌రూమ్‌లో పడుకుని నిద్రపో–పొద్దుటే కాఫీతాగి కార్లో వెళుదువుగాని!–'

'మళ్ళీ మీ కెందుకండీ, అనవసరం శ్రమ?–ఏ, సీ. షూట్స్ దార్లోనే కదండీ–అక్కడ డ్రాప్ చెయ్యండిచాలు–'

'నథింగ్ డూయింగ్....'

కారు టేంక్ బండ్ ఎక్కింది. కరుణాదేవి ఆ అందమైన రోడ్డిచ్చిన ప్రోత్సాహాన్ని స్వీకరించి స్పీడ్ ఎక్కువ చేసిందికాని సరిగ్గా మధ్యకొచ్చేసరికి రోడ్డుమధ్యని విశ్రాంతి తీసుకుంటున్న వో జంతువును చూసి తక్కువ చెయ్యవలసి వచ్చింది. తప్పుకొని మళ్ళాజోరుగా నడపసాగింది.

అక్కడ, విమెన్స్ ఎంప్లాయ్‌మెంట్ స్కీమ్‌వారి స్టాల్ చాటున ఒక దృశ్యం వారిదువురి దృష్టినీ ఆకర్షించింది—ఎవరో వొక జంట—పక్కపక్కగా కూర్చున్నారు—ఇద్దరిమధ్యా చీమదూరే సందైనా లేదు. ఒకరి చుట్టూ వొకరు చేతులు వేసుకొని, ఒకరి చెంప ఒకరి కానించుకొని వున్నారు—కార్లు వస్తూనే వున్నాయి. ఆగకుండా పోతూనే ఉన్నాయి—కార్లలో వెళ్ళేవాళ్ళకి మన నంగతే పట్టిందా అన్నట్టు వాళ్ళిద్దరూ ప్రపంచాన్ని మరిచి అలా కూర్చున్నట్టుంది.

వ్యాసమూర్తి కరుణాదేవీ ఒకరి కళ్ళలో కొకరు చూసుకున్నారు.

వ్యాసమూర్తి మాట్లాడదామని నోరు తెరిచాడు; కాని అతనికి మాట రాలేదు, నిస్సహాయంగా రెండోసారి ఆమెవేపు చూశాడు.

సీజన్లు హైములు లేని మానవ ప్రేమను గురించి వొకటి రెండు వాక్యాలు; ప్రస్తుతం కనబడ్డ దృశ్యంమీద ఒక వ్యాఖ్య. కరుణాదేవి మస్తిష్కంలో కదలాడాయి, ఆమె గొంతు సవరించుకుని అతనివేపు చూసింది—వెంటనే చూపు మళ్ళించుకొని, మాటలు గొంతులోనే ఉపసంహరించుకొంది. కాని ఆమె నోట పక్కుమని నవ్వుమాత్రం రాలేకపోయింది. మరుక్షణంలో ఆమె మునిపంట పెదవి నొక్కుకుంది.

*   *   *

బంజారా హిల్స్‌లో, కరుణావిల్లాలో గెస్ట్ రూమ్‌లో వ్యాసమూర్తి కూర్చు న్నాడు. అతనికి నిద్ర పోదామని లేదు, నిద్ర రానూ లేదు. ఒకసారి ప్రయత్నిం చాడు కాని. అదెంతో కృత్రిమంగా తోచి,లేచి కూర్చున్నాడు.ఇక ఇప్పుడప్పుడే ప్రయత్నించడు. నిద్రకంటే ముఖ్యమైనదేదో, అసాధారణమైనదేదో, జరగాలని అతని కనిపిస్తోంది....

నిద్రొచ్చేదాకా ఏదేనా రాసుకోవాలనుంది; ఇన్ని తెల్ల కాయితాలు పడెయ్యండి—అని పుచ్చుకున్న లెటర్‌పాడ్‌లోని కొన్ని కాయితాలు టీపాయ్ కింద చిన్న ముక్కలుగా, కొన్ని నలిగిపోయిన ఉండలుగా ఉన్నాయి. కొన్ని మాత్రం నీటుగా దీటుగా నిండిపోయి టీపాయ్‌మీద వున్నాయి. వ్యాసమూర్తి వాటివి చదువుతూ, ఆలోచిస్తూ జ్ఞాపకాలు తెచ్చుకుంటూ, ముందుకివెళ్ళడం కోసం వెనక్కు వెళ్ళే ప్రక్రియ సహాయం తీసుకొంటున్నాడు.

ఎన్నాళ్ళైరోజులైంది, వ్యాసమూర్తి కరుణాదేవిని మొట్ట మొదటిసారి చూసి....

2

"రాజారావుగారు ఫారిన్ వెళ్ళేరు" అంది కరుణాదేవి.

"నేను తమ కోసమే వొచ్చానండి–"

కరుణాదేవి ప్రశ్నార్థకంగా చూసింది.

'నన్ను హనుమంతరావుగారు పంపేరు.... మీతో నా గురించి ఫోన్లో చెబుతా నన్నారు....'

"ఓహో, అతనా ను–"వ్వన్నట్టు చూసింది కరుణాదేవి. హనుమంతరావు నిన్న ఫోన్‌లో– 'నీ దగ్గిరికో అబ్బాయిని పంపిస్తాను. అతనికి నీవల్ల ఓ ఉప కారం కావాలి: నాకు చేసినట్టే భావిస్తాను–' అన్నప్పుడా అబ్బాయి ఇంత ముదు రుగా ఉంటాడని ఇంత గడుసుగా మాట్లాడతాడని, ఇంత నిబ్బరంగా నించుంటా డని– అనుకోలేదు. అతనేదో చెప్పుతు పోతాడానీ, అలా చెప్పుతు పోకుండా వో నిమిషం ఆపాలనీ అనిపించిందామెకి.

"హనుమంతరావుగారు కేంప్ వెళతా నన్నారు....?"

"నిన్న జీ టీ. లో వెళ్ళేరండి."

"వాళ్ళమ్మాయి చెయ్యికాల్చుకుందటనే, ఇప్పుడెల్లా వుంది?"

"కొంచెం నయమేనండి...."

"వంట మనిషి దొరకలేదన్నారు—?"

"లేదండీ— డ్రైవరు వంతులే ఒండి పెడుతున్నా డింకానూ."

ఇంకేమేనా అడుగుతారా అన్నట్టు చూస్తూ ఉండిపోయాడతను.

"రాజ్యలక్ష్మీ!" అని కేకేసింది కరుణాదేవి—అల్లందూరాన అవతలి ద్వారాన రెండుమూడురంగులు తళతళ లాడాయి.

"కాఫీ తీసుకురా." అనేసికూడా.

"టీ తీసుకుంటారా?" అని మృదువుగా అతన్ని సంప్రదించి.

"ఏదైనా ఫర్వాలే"దని అతనన్నాక:

"ఇవన్నీ ఎందుకులెండి. ఇప్పుడు." అని అనలేదుకదా అని:

"ఫర్వాలే"దనుకుంది- కరుణాదేవి.

"మీ పేరు?"

"వ్యాసమూర్తి"

"అబ్బా, వ్యాసమూర్తే!,- గల గలా నవ్వింది కరుణాదేవి "ఏ వ్యాసమూర్తి?"

"అదిరాజు వారు, మా యింటిపేరు,"

"ఆదికాదు నేనడిగింది——" చమత్కారానికి తెచ్చుకున్న నవ్వు నిండుగా. హృదయపూర్వకమై వొచ్చేసింది; "భారతం రాసిన వ్యాసుడా భాగవతం రాసిన వ్యాసుడా?—

ఆవిడ తనతో కులాసాగా మాట్లాడుతున్నందుకు సంబరపడి తనని తాను అభినందించుకున్నాడు, అందులోమునిగిపోయి"ఇద్దరూ,వొకరే కదండీ."అన్నాడు

"ఇద్దరూ వొకరే—" నవ్వుకుంటూ కూచుంది కరుణాదేవి, "ఓస్ ఇంతేనా"అన్న హేళనలేక పోలేదు ఆ నవ్వులో. తల ఆడించి"కాని ఇద్దరూ ఒకరెల్లా అవుతారు?" అంది.

బిక్కమొహం వేసేడు, వ్యాసమూర్తి ఇదేదో సర్వీస్ కమీషన్ ప్రశ్న లాగే ఉంది. ఒకవేళ ఇదేవొస్తే?

—మరుక్షణంలో అతను అవకాశం చిక్కబట్టుకొని చకచకా మాట్లాడేడు; తను గ్రాడ్యుయేట్, ఫస్ట్క్లాస్, యూనివర్శిటీ రేంక్ స్పోర్ట్స్మన్. యన్. సీ సీ; కల్చరల్ ఎసోసియేషన్ జాయింట్ సెక్రటరీ, మెడల్స్, ప్రయిజెస్, మెరిట్ సర్టిఫికెట్స్.- ప్రస్తుతం గ్రూప్-టూ సర్వీస్‌లో ఒక ఉద్యోగం

కోసం ప్రయత్నం. వ్రాతపరీక్షల చాలా బాగా వ్రాసేడు. ఇంటర్వ్యూ ఆదురోజు లుంది. మంచి రికమెండేషన్ ఉంటేనే మంచి ఉద్యోగం దొరుకుతుందన్నారు—

'......... ఈ పని మీవల్లే కావాలని హనుమంతరావు గారన్నారండీ'

"నోనో.... రాజారావుగారైతే ఏమోకాని– నేనా?'

'ఆ విషయం డిస్కస్ చేసేరండి. వారికంటే తమరు తల్చుకొంటేనే బాగా పని జరుగుతుందన్న నిశ్చయాని కొచ్చేరండి. హనుమంతరావు గారు....'

కాఫీలు ఒచ్చేయి. మాటలు ఆగేయి.

'—ఇంతాచేసి స్టేట్ గవర్నమెంట్లో ఉద్యోగానికా? రాజారావుగారైతే ససేమిరా కలగ జేసుకోరు. నేను కలగ జేసుకున్నానని తెలిస్తే ఊరుకోరు కూడానూ. ఇంతకీ హనుమంతరావుగారికి మిమ్మల్ని స్టేట్ గవర్నమెంట్లో పెట్టవలసిన ఖర్మేమొచ్చిందో.... సరే ఇంటర్వ్యూ పదకొండో తారీకు వన్నారుగా. పదో తేదీ సాయంత్రం వోసారి కనిపించండి. మిమ్మల్నో చోటికి తీసుకువెళ్తామ–' అంది కరుణాదేవి.

వ్యాసమూర్తి లేచి నమస్కారం చేసేడు. 'చాలా థేంక్సండీ' అన్నాడు. అతని మొహంలో చిరునవ్వు మెరిసింది. 'హనుమంతరావుగా రన్నట్టే జరిగిందండి. సరిగ్గాను. రాజారావుగారుంటే పని జరగదని ముందే చెప్పారాయన. ఈ సమయంలో వారు ఫారిన్ వెళ్ళిపోయుండడం నా అదృష్టం....'

అతనలా వెళ్ళిపోగానే కరుణాదేవి ఫోన్ఎత్తి ఓ నెంబర్ డయల్ చేసి 'నేను తొందర పడుతున్నానా?' అనుకొని, నవ్వుకొని, మాట్లాడసాగింది.

0 0 0

ఇంటర్వ్యూకు ముందు రోజున వ్యాసమూర్తి కరుణావిల్లాకు వెళ్ళాడు. ఆవిడ కార్లో, వెనక సీట్లో కూర్చుని సర్వీస్ కమీషన్ మెంబర్గారింటికి వెళ్లాడు. మెంబర్గారికి తెలుగు బాగా రాదు. ఉర్దూలోనే వాళ్ళిద్దరూ ఏవో మాట్లాడుకుంటూ లోపలకి వెళ్ళారు. పదినిముషాలయ్యేక 'చా' ఒచ్చింది. మరో పది నిమిషాలకి మెంబర్గారి భార్య, కరుణాదేవి, మెంబర్గారూ, ఇవతలికొచ్చేరు.

వ్యాసమూర్తితో మెంబర్గారు ఒక్క వాక్యంకూడా మాట్లాడలేదు. కాని అతనికి తప్పకుండా ఏదో ఉపకారం చేసేటట్టే అతని కళ్ళల్లోకి దయగా చూసేడు.

* * *

ఇంటర్వ్యూనాటి సాయంకాలం కరుణాదేవిని చూడడానికి వెళ్ళేడు వ్యాసమూర్తి. అతన్ని చాలా కరుణతో చూసిందావిడ. స్వయంగా టీ తెచ్చియిచ్చింది. ఇంటర్వ్యూలో తనని పరీక్షించిన విధం, తనని అంతలేసి పెద్దపెద్ద ఆఫీసర్లు గుర్తించిన విధం అతను వర్ణించి చెబుతూ ఉంటే ఆమె చాలా ఉత్సాహంతో వింది.

తను హాల్లోకి వెళ్ళగానే అందరి మొహాలూ చిరునవ్వులతో కలకలలాడేయని వ్యాసమూర్తి చెప్పగానే ఆవిడ సోఫాలో వెనక్కి చేరబడి కాలుమీద కాలు వేసుకొంది.

*　　　*　　　*

ఉద్యోగానికి ఆర్డర్ వచ్చినవాడు వ్యాసమూర్తి మళ్ళీ కరుణావిల్లాకు వెళ్ళాడు. థాంక్స్ చెప్పాడు.

'నా కెందుకూ థేంక్సు!– మీ హనుమంతరావుగారికి చెప్పు' అందావిడ.

'మీ దగ్గరికి పంపించినందుకు ఆయనకి థేంక్స్ చెప్పివలసిందేనండి'

'ఉండు. మరిచిపోకుండా ఈ థేంక్సు పార్టీ ఈయన కూడా యిద్దాం' అంటూ కరుణాదేవి, మెంబర్‌గారి నంబరు డయల్ చేసి మాట్లాడింది.... 'విన్నావా ఆయనకూడా నాకే థేంక్సంటున్నారు.' అని నవ్వుతూ ఫోన్ పెట్టేసింది.

వ్యాసమూర్తి ఆశ్చర్యంగా చూశాడు.

'.... మేం చేసిం దేముంది? మీరు పంపిన కేండిడేట్ అన్నిటా ఫస్ట్ రావడమే కాకుండా, మేం అడిగిందే తడవుగా అన్నిటికీ ఆన్సర్స్ చెప్పేడు. అంత బ్రిలియంట్ మేన్‌ని గవర్నమెంట్ సర్వీసులో మా ద్వారా చేర్పిస్తున్నందుకు మీకు థేంక్స్–అన్నాడోయ్, ఆయన!' అన్నది కరుణాదేవి.

వెంటనేలేచి 'ఇంకేమిటి, విశేషాలు?– నేను సికింద్రాబాదు వెళ్ళాలి. ఏమేనా మాట్లాడాల్సి ఉంటే పద, కార్లో కూర్చుని మాట్లాడుదువుగాని. మళ్ళీ కార్లో వచ్చేద్దువుగాని' అంది.

ఏం మాట్లాడానికి లేకపోయినానరే, ఆవిడతో కారులో కూర్చుని ప్రయాణం చేసే అవకాశం వొదులుకోలేక వ్యాసమూర్తి ఆవిణ్ణి అనుసరించేడు.

0　　　0　　　0

కెంటోన్మెంట్‌లో ఎవరో మిలిటరీ ఆఫీసర్‌తో పదిహేను నిమిషాలు

యకా మాట్లాడిందావిడ. డ్రైవరూ, వ్యాసమూర్తి ఏకాంతంగా బైట కూర్చో వలసొచ్చింది.

'చుట్టాలా: వారూ వీరూ?' అన్నాడు వ్యాసమూర్తి.

'ఎవడికి తెలుసు?' అని అటు తిరిగి బీడీ ముట్టించాడు డ్రైవరు.

తిరిగి వచ్చేటప్పుడు టాంక్ బండ్ ట్రాఫిక్ ఐలండ్ దగ్గర 'కారిక్కడా పిస్తే నేనిలా గన్ ఫౌండ్రీకి వెళిపోతానండీ' అన్నాడు వ్యాసమూర్తి.

'గన్ ఫౌండ్రీ కెందుకు?'

'నా రూమ్ అక్కడేనండి.'

'ఊఁహూఁ, కారు అటు పోనీవోయ్.'

కాలేజ్ దగ్గర దిగి, వ్యాసమూర్తి రెండడుగులు వేసేడు. కారు ఫతే మైదాన్ రోడ్డువేపు తిరిగి వెళ్ళిపోతూ ఉండడం ఆశ్చర్యంగా గమనించాడు. కారు వెళ్ళిపోడంలో ఆశ్చర్యం ఏమీలేదు. కాని మొత్తంమీద ఆశ్చర్యపడేది ఏదో జరిగినట్టుంది.

దక్షిణామూర్తీ అతనూ అక్కడ ఢీకొట్టుకున్నారు.

3

"ఏంవోయ్! ఎటు చూస్తూ నడుస్తున్నావ్?.... ఇంకో రెండడుగులు వేసి ఆ స్టేట్ బ్యాంక్ దగ్గిర ఇలా నడిచేవంటే చాలు....' అన్నాడు దక్షిణా మూర్తి నవ్వుతూ.

"నాకు స్టేట్ బ్యాంక్ దగ్గిర ఈ వేళప్పుడేం పనుందీ–ఏదో తమలాంటి వాళ్ళకి తప్ప–" అన్నాడు వ్యాసమూర్తి తనూ నవ్వేస్తూ,

"అదే, అదే!– ఆ కార్లోంచి దిగినవాడు ఇంకెలా మాట్లాడుతాక్కా–! ఇంతకీ ఈవిణ్ణెలా పట్టావ్"

"పట్టడం ఏమిటి, నేనేం దయ్యాన్నా, శనినా?"

"దయ్యానివి కాకపోవచ్చుగాని, శనివి మాత్రం అవును!"

"అయితే అయ్యానుగానీ, ఇవాల్టితో నా శని విరగడై పోయింది. గ్రూప్– టూ సర్వీసెస్‌లో నాకు సెలక్షన్ ఒచ్చింది. ఇవాళే ఆర్డర్స్ వచ్చాయి...."

"ఊఁ అలా చెప్పు!– ఈవిడిద్వారా వచ్చుంటుంది," అన్నాడు దక్షిణా మూర్తి ఆశ్చర్యపడకుండా.

"ఈవిడ, ఈవిడంటున్నారేమిటండీ- ఎవరో పక్కనే ఉన్నట్టు! ఆవిడ బంజారాహిల్స్‌కి వెళ్ళిపోయుంటుంది!"

దక్షిణామూర్తి నవ్వేశాడు. "అబ్బో, అబ్బో! బంజారాహిల్స్! చాలా దూరం వెళ్ళిందన్నమాట, వ్యవహారం!- జాగ్రత్తసుమా! అక్కడ మేడల గోడలేకాదు, మనుషుల మనసులూ రాళ్ళమయంగా ఉండొచ్చు!" పరిహాసం మేళవించిన మందహాసం విసురుతూ, దక్షిణామూర్తి దక్షిణ హస్తంతో వ్యాసమూర్తి వీపుమీద ఓ బరువయిన గుల్లదెబ్బ వేశాడు.

దక్షిణామూర్తి ధోరణి చాలా ఎబ్బెట్టుగానే ఉంది. అయినా సంతోషంలో, ఆనందాతిరేకంలో, తను మంచి ఉద్యోగం సంపాదించేడన్న సంగతి నలుగురూ తెలుసుకుంటున్నారన్న గర్వంలో, గుర్తించికూడా పట్టించుకోలేదు వ్యాసమూర్తి.

తనకి ఆవిడకీ పరిచయం కావడం, అదంతా వరసగా చెప్పేశాడు.

దక్షిణామూర్తి డిప్లొమాటిక్‌గా నవ్వేడు.

"ఉఁహూఁ....హనుమంతరావుగారూళ్ళో ఉన్నారా?"

"లేరు. టూర్ ప్రోగ్రాం ప్రకారం యివాళ రాజమండ్రిలో ఉంటారు. ఐదార్రోజుల్లో వొచ్చేస్తారు...."

"ఆయనేం చెప్పారు నీతో. ఈవిణ్ణి గురించి?"

"ఏం చెప్పలేదు, ఫలానాచోట వాళ్ళిల్లు, ఆవిడకి నీ గురించి ఫోనులో చెప్పాను ఓసారి నువ్వెళ్ళి కనబడు, నీకు తప్పకుండా హెల్ప్ చేస్తుంది అన్నారు—"

"ఆవిడ ఎవరూ ఏం కథ-ఇవేం చెప్పలేదూ—?"

"ఆవిడ డాక్టర్ రాజారావుగారి భార్య?"

"అది సరేలేవోయ్- అసలు సంగతేం చెప్పలేదన్నమాట....పోనీలే—విన్నెలా చూస్తోంది?"

"చాలా దయగా చూస్తోంది?—"

దక్షిణామూర్తి మళ్ళీ భావగర్భితంగా నవ్వాడు. "దయేమిటోయ్, వెర్రివాడా! దయ చాలారోజులై ఆవిడ లోకాన్ని విడిచి వెళ్ళిపోయింది. ఆప్యాయం అను, ఇష్టం అను. ఇంకేదేనా అను. అందులో కరుణాదేవిగారా!— పేరుకి మాత్రం కరుణ!— చేసేపన్లు—"

"ఏం చేస్తుంటేం?"

"ఏం చేస్తుందా?— మొగాళ్ళని ఆడిస్తుంది. మొగాళ్ళతో ఆడు కుంటుంది. నీక్కూడా అదృష్టం పట్టిందేమోనని!—"

"ఛీ ఛీ—ఏమిటండీ. మీ మాటలు?"

* * *

"ఊఁహూ....ఏం, ఆవిడందంగా లేదా?"

"................"

"చెలాకీగాలేదా, కలుపుగోలుతనంగా లేదా?- మొగాళ్ళని వెర్రి వెధవల్ని చేసి పడేసేవి ఏమిటి లేవు, ఆవిడ దగ్గర?"

"నా కర్థం కావడంలేదు-"

"....మొదట్లో ఎవడికి మాత్రం అర్థమై ఏడిసింది గనక! నువ్వింటాక అన్నట్టు, ఆవిడ డాక్టర్ రాజారావుగారి భార్య అని మాత్రం అందరికీ అర్థమవుతుంది....ఆవిడకున్న పలుకుబడి అసలు రాజారావుగారికుందా అని!-ఐ.సి.యస్. ఆఫీసర్లు, గవర్నరు, గవర్నమెంట్ సెక్రటరీలూ, సర్వీస్ కమీషన్ మెంబర్లు, రెవెన్యూబోర్డు మెంబర్లూ, ఐ.జి. ఆఫ్ పోలీసూ, కార్పొరేషన్ మేయరూ— రిట్జ్, పెర్సీస్, రాక్ కేసిల్ లాంటి హోటళ్ళు—శవాయ్, మంజూస్, లిడోస్, విక్కాజీప్‌లాంటి బార్లు—ఆవిడ మాట తీసెయ్యగల మహానుభావుడీ జంట నగరాల్లో లేడు నాయనా—అలాంటావిడతో పరిచయం అంటే అదృష్టంగాక మరేమిటి?"

వ్యాసమూర్తి కళ్ళు మెరిశాయి.

"—ఈవిడ మొదట్లో పిఠాపురం దగ్గిర ఏ వూరునుంచో వచ్చిందయ్యా. బాగా చదువుకుంది,ఆంధ్రా యూనివర్సిటీలో పోస్టు గ్రాడ్యుయేషన్—చదివిందో, ఒడ్డెక్కించిందో తెలీదు...మామూలుగా మేరేజ్ కాలేదు. ఎవరితోటో వెళ్ళిపోయిందనీ, ఒక కొడుకో, కూతురో పుట్టడం కూడా జరిగిందనీ చెప్పుకుంటారు —పరమాత్ముడి కెరుక!....ఆనర్స్ చదువుతూ వుండగా ఒక పెద్ద ఎలక్ట్రికల్ ఇంజనీర్— రిటైరయిపోతూ ఉన్నాయన—ఈవిణ్ణి చేరదీసేడు—ఆయనతో ఎనిమిదేళ్లుంది, ఆయన పోతో పోతో ఆస్తంతా ఈవిడ పేరబెట్టి వెళ్ళాడు. డబ్బుచూసి అనేకమంది వెంటబడ్డారు.... కొంచెం అనుభవం, బలం, వచ్చేయిగా! ఎవర్నీ చేరనియ్యలేదు.... అలా కొంతకాలం స్వేచ్ఛగా, పెద్దపెద్ద వాళ్ళతో మాత్రం పరిచయం చేసుకొని వాళ్ళతోనే తిరుగుతూ— అంతా అట్

మోస్ట్ సీక్రెసీలోఅనుకో- గడిపేసింది— రాజారావుగారి పరిచయం అయి ఆరేళ్ళయింది. ఈ ఆరేళ్ళయి ఆవిడ ఆడింది ఆటా పాడింది పాటా— ఆయన కేమిటి, పెద్దవాడు! ముగ్గురు కొడుకులున్నారు. ఒకడు యూకేలోనూ ఇద్దరు అమెరికాలోనూ సెటిలై పోయేరు. ఇంకెవ్వరూ లేరు; లంకంత యిల్లూ, గంపంత ఆస్తీ కొండంత ప్రతిష్ఠా తప్ప!— అలాంటప్పుడు ఈవిడ తటస్థపడింది. తెలివీ, అందం, యౌవనం, హుషారూ, మాట నేర్పరితనం వున్న మనిషి ....ఇన్నిటికీ మించి మొగవాణ్ని సంతోషంలో వూగించడంలో వూరించడంలో ఆవిడకున్న చాకచక్యం లోకంలో చాలా అరుదంటారు— ఆయన స్వర్గం అనుభవించి ఆనందపు లోతులూ, అనురాగపుటంచులూ చూసేడు.... ఇప్పుడిప్పుడు ఆవిడ చేసేపన్లు- అన్నీ కాకపోయినా కొన్ని- ఆయన కర్ణాకర్ణిగా వినేసరికి- చాలా బాధపడి,ఈవిడ ఎలాగైనా వదుల్తే బావుణ్ణురా అని చూస్తున్నాడు.... ఒకానొక సందర్భంలో డైవోర్స్‌కి లక్షరూపాయలు ఆఫర్ చేసేడని చెప్పుకుంటారు—"

"ఇవన్నీ నా కెందుకండీ— నేనేదో హనుమంతరావుగారు పంపేరుకదా అని వెళ్లేను; ఆవిడ రికమెండ్ చేస్తే సెలక్షన్ ఒస్తుందన్నారు; ఒచ్చింది—!"

"అంతే అనుకుంటున్నావా?.... వెర్రినాయనా!........అంత సుళువా. ఆవిడ పంజరంలోంచి వరాలై పారిపోడం! శ్లేష్మంలో పడ్డ ఈగ నయం! ఆవిడ కిష్టం ఉండనీ, ఉండకపోనీ: నీ కావిడ వెంట పడదామనిపించేటంత వరకూ తెస్తుంది. నీ చేత యామండీ అనిపించుకుంటుంది. నిన్ను ఏం వోయ్ అంటుంది. ఇవ్వండీ అని పదే పదే అడిగించుకుంటుంది; ఇస్తాను రేపురా అంటుంది. వెయ్యేళ్ళు ఆశపెట్టి వేలిచుట్టూ తిప్పుకుంటుంది. ఒక్కొక్క మొగవాణ్ని ఒక్కొక్క బీర్ బాటిల్‌కన్నా కనాకష్టంగా చూసి అవతల విసిరేస్తుంది... తిరిగి చూసేసరికి పెంటపోగుమీద వుండడంతప్ప ఈ వెధవాయగారు చేసేదేమీ వుండదు—"

ఏదో ఉపన్యాసం విన్నట్టుండడం దగ్గర్నుంచీ ఎడ్వెంచర్ సినిమా చూసినట్టుండడం వరకూ అనుభవాలు పొందేడు వ్యాసమూర్తి 'అలా ఎన్నాళ్ళు సాగుతుందండీ ఆవిడకి మాత్రం?—ఇంతమందీ నేడిపిస్తే యెంతపగ ప్రబల్తుంది!"

దక్షిణామూర్తి ఎగతాళిగా నవ్వాడు. మళ్ళీ మొహం చిట్లించుకొని అన్నాడు: పగ!— ఏర్పడ్డం ఎంతసేపు. ఏగానికి కొరగాకుండా ఎగిరిపోయి

చావడమూ ఎంత సేపు! రాళ్ళు ఆవిడకి తగలవు; రక్తమూ మెది ఉడకదు—చిరునవ్వుతో చిదంబరం పంపేస్తుందిరా నాయన! పలుకుబడి పళ్ళతోటలా వున్న మనిషికిపగే ఒక భయమా?

—అప్పుడప్పుడీవిడకి కనబడి నా విశ్వాసాన్నీ కృతజ్ఞతనీ తెలియజేస్తూ వుండాలని గంటన్నర క్రితం చేసుకున్న నిర్ణయాన్ని తుడిచి అవతల పారేశాడు వ్యాసమూర్తి.

0 0 0

కాని, ఆవిడ వొదిలిందా?—

—సరిగ్గా ఐదోరోజున— ఏదో కారు—గన్ ఫౌండ్రీ సందుల్లో గర్జించుకొంటూ గన్ పేల్చినట్టు బేక్ ఫైరింగు చేసుకుంటూ, తిరిగి తిరిగి, ఆఖరికి వ్యాసమూర్తి రూమున్న యింటిముందు ఆగింది.

కింద- "బ్రహ్మచారీ మఠ్"లో వుంటున్న సిద్ధేశ్వర్ పెర్షాద్‌ని 'వ్యాస్ మూర్తీ కహాఁ రహతే?' అని అడిగిన కరుణాదేవి కంఠస్వరాన్ని వ్యాసమూర్తి గుర్తుపట్టాడు. అంతే.... గడ్డంగీస్తున్న అతని రేజర్ జారిపడ్డట్టయింది. అతను వూహించసాగాడు—వాడు బహుశా ఆవిడ రూపానికి పరవశించి; ఠీవికి ఆశ్చర్యపడి, అధికారానికి భయపడి; అవన్నీ చూసి నిర్ఘాంతపడి— నోటంట మాటరాక, ఒకవేలు పైకి చూపించి, 'ఊపర్' అన్నట్టు తలయెగరేసి, వొగుటతో. రాబోయిన మాటని మింగేసుంటాడు- టైమ్‌లేదు. మెట్లెక్కి- ఆవిడ మేడమీద కొచ్చేస్తూవుంటే, పేముతో తయారు చెయ్యబడ్డ 'మోడా'- తన రూమ్‌లో వున్న ఒకే వొక ఫర్నిచర్ పీస్-ని ఖాళీ చెయ్యటానికి వ్యాసమూర్తి పడ్డయాతన వర్ణనాతీతం.... దానిమీద గుండు సూదుల దగ్గర్నుంచీ బెండగింజల వరకూ ఏవేవో-వున్నాయి.

"నమస్కారమండీ" అన్నాడతను. ఆవిడ ద్వారం అవతల కనబడగానే.

"నమస్కారం!.... ఇక్కడుంటున్నావా, నువ్వు- నువ్విచ్చిన డోర్ నంబరుతో ఈయిల్లు కనిపెట్టినందుకు నువ్వుగాని,ఈకార్పోరేషన్ వాళ్ళుగాని.... తనకేదైనా స్పెషల్ ప్రయిజ్ యివ్వాలంటున్నాడు మా డ్రైవరు!"

"క్షమించండి. మా రూమ్‌లోకి తమలాంటి వారొస్తే కూచుందికి కూడా ఏమీ లేవు దయచెయ్యండి. ఆ డ్రైవరో మరెవరో తోలెయ్యలేకపోయారా నేను రాకపోయానా? ఈ డర్టీప్లేస్‌కి మీరు రావడం...."

"అదేం లేదులే: బాధపడకు. నాలుగైదు నెలల్లో నువ్వే సంపాదిస్తావు; ఫర్నిచర్ కేముంది!.... సరే నువ్వెంతసేపట్లో బయల్దేరగలవు? మనం అలా వెళ్ళాలి—"

వాచీ చూసే మిషతో ఆవిడ పక్కకి తిరిగి నవ్వుతుంటూ వుండే పరధ్యానంగా తనమొహం అద్దంలో చూసుకొని, సబ్బురాసిన సగం గీసిన ఈ మొహాన్ని ఈవిడ యింతసేపూ నవ్వకుండా యెలా చూడగలిగిందా అని ఆశ్చర్యపడ్డంలో, ఆవిడడిగిన ప్రశ్నకి సమాధానం చెప్పడం మరిచిపోయాడు వ్యాసమూర్తి.

"నాకో చిన్న సాయంచేసి పెట్టాలి నువ్వు..."

"నేనా?.... మీకా....?— సాయంచేసి పెట్టడమా?— మీరు ఫోన్ చేస్తే పెద్ద పెద్ద వాళ్ళు మీ గుమ్మంలో వాల్తారు...."

కరుణాదేవి నవ్వేసింది. "ఇది పెద్దవాళ్ళ కప్పగించే పనికాదులే—"

ఎక్కడో ఏదో ఫర్నిచర్ కంపెనీ ఉందట—వాళ్ళదగ్గర ఏవో స్పెషల్ క్వాలిటీ పెయింట్స్ ఉంటాయట. అవి ప్రత్యేకం వాళ్ళ స్పెషల్ లైసెన్స్ క్రింద ఇంగ్లాండ్ నించి వస్తాయట.... ఆ ఫర్నిచర్ కంపెనీ వాళ్ళతో మాట్లాడి, నాలుగు రకాల రంగుల నాలుగు డబ్బాలు రిజర్వ్ చేయించి; ఆవిడ వేరేచోట, వేరే ప్యాట్రన్‌లో తయారు చేయిస్తోన్న ఫర్నిచర్‌కి ఆ కంపెనీ స్ప్రేయింగ్ మెషీన్స్‌తో వేయించాలి....

"దీంట్లో నే చేసే దేముందండి? వాళ్ళెవరో ఎక్కడుంటారో కూడా నే నెరగను...."

"నేనుమాత్రం ఎరుగుదునా?—నా పక్కన నిలబడ్డమే; నువ్వు చేసే దల్లాను—మిగతాదంతా నే చూసుకుంటాను— రెడీయేనా?—బయల్దేరు మరి!"

"అసలావిడ తత్వమే అంత" అన్నాడు దక్షిణామూర్తి— "ఆవిడపని ఆవిడ చేసుకోగలదు; అలా చేసుకోనివ్వాలికూడాను— కాని పక్కన ఎవడో ఒకడు నిలబడాలి!– అది జవాబుదారీకే అనుకో. లేకపోతే డాబుసరికే అనుకో– మొత్తంమీద ఎవడో ఒకడు వుండవలసిందే!....

"—నువ్వావిణ్ణి ఒదలొద్దు....ఎప్పుడైతే నీ రూమ్‌కి రావడం కూడా ప్రారంభించిందో, అప్పుడే కథ చాలావరకూ వెళ్ళిందన్నమాట....ఈ మాత్రం గౌరవం చాలా రోజుల్నించీ ఎవరికీ జరగలేదు....ఈమధ్య చిన్న కుర్రాళ్ళ మీదికి పోతోందిలే....కాని వొక్కటి మాత్రం గుర్తు పెట్టుకో. నీ బెజవాడ

యస్సారార్ కాలేజి టేక్టిక్స్ ఏమీ పని చెయ్యవిక్కడ....అరితేరిన బుర్ర. అతి జాగ్రత్తగా వుండాలి—అంతెందుకూ. ఎక్కడా పప్పులో కాలు వెయ్యకుండా వ్యవహారం చివరంటా నడిపించి ఒడ్డెక్కిస్తే నీకు నాదో స్పెషల్ ప్రయిజ్—ప్రస్తుతానికి ఇదీ—"

వ్యాసమూర్తి నరాలు జివ్వుమన్నాయి. ఆలోచించడానికిష్టంలేనంత హడావిడి పడ్డాడు. అతని మనస్సు మాత్రం దక్షిణామూర్తి సూచించిన ధోరణిలో కొట్టుకుపోతోంది. "ఏమిటండోయ్, అది!" అన్నాడు ప్రస్తుతానికి వొస్తూ. సందేహాలు అడగకూడదనిపిగా మిగిలి, ఇంకిపోయాయి.

"ఇది థియేటర్ అనీ, ఒక నవలలే. సోమర్సెట్ మామ్ అన్నతను వ్రాసేడు—చదువు, నీకు బాగా, టెక్ట్సుబుక్కులా పని చేస్తుంది—"

o o o

అవకాశంకోసం వెతుక్కోడం వ్యాసమూర్తికొక వ్యాపకమైపోయింది—ఆవిడకీ తనకీ ఏమన్నా సాపత్యం సమత్వం ఉన్నాయా? ఏమిటి సంబంధం? ఇది- ఈ ధోరణి నిజమేనా? అన్న ప్రశ్నల్లేవు—ఉన్న క్షణాల్లో కొట్టొచ్చినట్టు తెలుస్తూనే ఉంటుంది, అంతెత్తున వుంటుందిక్కడెందునా, ఆవిడ. తను చాలా అల్పుడేమో—కాని అలా అనుకోడం యిష్టం వుండదు. అలా ఎంతసేపు ఆలోచించడు... ఆవిడకొక బాయ్ ఫ్రెండు అవసరం కాబో లనిపిస్తోంది. దానికి కారణాలూ, ఆర్గ్యుమెంట్లూ. ఒకవేళ ఆవిడకి బాయ్‌ఫ్రెండ్ కావలసివచ్చిన సందర్భంలో తనకన్నా అర్హు డెవరు?... అందుచేత ఎలాగో ఒకలాగ ఆవిడతో అనుబంధం తెగకుండా బంధం గట్టి పడేటట్టు జాగ్రత్తపడాలి—అదీ దక్షిణామూర్తిగారి వుద్బోధా, తనకి సబబనిపించిన రీతీనూ. రోజూ కలుస్తాడు. ఎంత వరకూ వచ్చిందో చెప్పమంటాడు.ఏవో సలహాలు చెబుతాడు.చిక్కగావివరిస్తాడు, చక్కని ఉదాహరణలు తెస్తాడు, వాతావరణంలా, వ్యసనంలా, చుట్టూ వ్యాపిస్తాడు.

చివరికి ఓ అవసరంలాంటి అవకాశం తగిలింది.

"ఇక్కడ హైదరాబాద్‌లోనూ ఒక బేచ్ వాళ్ళు ఈ పనికి ట్రెయినింగ్ అవుతూ వుంటేకూడా, నన్ను కర్నూల్ వేసేం పొమ్మంటున్నాదండి. నేను యల్.యల్బి. చదువుకుందామని పుస్తకాలు పోగు చేసేను, నాతోసహా చదవడానికో అబ్బాయినీ సెలక్టు చేసుకున్నాను. ఇంక ఫీజు కట్టడ మాలస్యం. ఇప్పుడు కర్నూల్ వెళ్ళిపోతే-"

"ఇది చాలా సిల్లీగా ఉంది. ఆఫీసర్లు బాధపడతారు—వాళ్ళఆఫీసుల్లో, కార్యనిర్వహణ కోసం లక్ష ఆర్డర్స్ వేస్తారు. అన్నీ సదుపాయంగానే ఉండవు ఎక్కడో ఏదో ఒక అర్డర్ ఎవరికో వొకరికి ఇబ్బందిగానే ఉంటుంది; అలా అని అన్నీ మారుస్తూ కూర్చుంటే వాళ్ళు పని చేయించుకోడం ఎలాగ?—ప్రతీ సారీ ఇలా ఒకరిమీద ఆధారపడి ఉద్యోగం ఎంతకాలం చేస్తావు!"

"ఈ ఒక్కసారికీ మీరు నాకీ సాయం చెయ్యాలండి, ఫీజ్ కట్టేసిన తరవాత కోర్స్ అయ్యేవరకూ మార్చరు—"

కరుణాదేవి నవ్వకుండా వొక్కనిమిషం కూచుంటే. దీనంగా ఏదేనా అందామనీ, నేననకపోతే మాత్రం ఆవిడ నన్నీ ఊర్నించి చూస్తూ వెళ్ళిపో నిస్తుందా అనీ— అనుకొన్నాడు. కష్టపడి నోరు మూసుకు కూర్చున్నాడు.

"హనుమంతరావుగార్ని కన్సల్ట్ చేసేవా?"

"లేదండీ, నిన్న ఆయనకోసం ఆఫీసుకి వెళితే లేరు—"

"ఇంటి కెళ్ళేవా. మరి?"

"లేదండి—"

"ఏం?—అప్పుడే ఆ యిల్లు మరిచిపోయావా. లేకపోతే ఆ ఇంటికి వెళ్ళక్కర్లే దనుకున్నావా?... నువ్వు కనబడ్డం లేదని నాతో వచ్చి చెప్పా డాయన! ఇదేం బావులేదు... సరే! మీ డిపార్టుమెంట్ హెడ్‌కి ఫోన్ డయల్ చెయ్యి: మాట్లాడదాం... ఇంతకీ ఈ ట్రాన్స్‌ఫర్ ఆపుచెయ్యమని వ్యక్తిగతంగా నువ్వు దరఖాస్తు పెట్టేవా, లేకపోతే వాళ్ళని నీ వేనిటీతో సర్‌ప్రైజ్ చేద్దామను కుంటున్నావా?"

"పెట్టేనండి, పిటిషన్."

"సరే డయల్ చెయ్యి, నెంబరు— సాయంత్రం లోపుగా హనుమంతరావు గార్ని కలు."

ఆ సాయంత్రం వ్యాసమూర్తి బాధ భరించలేక దక్షిణామూర్తి దగ్గిర కెళ్ళాడు.

"ఎక్కడో పల్టీ కొట్టుంటుంది: నిన్ననో మొన్నోను! ఆ అక్కసు కాస్తా నీ మీద తీర్చుకొంది, అంతే! కంగారుపడకు. చదువు తీసుకుందన్నమాట. లేకపోతే చీవాట్లెలో వేస్తుంది...?"

వ్యాసమూర్తి కొక్క ముక్క కూడా బోధపడలేదు.

"పట్టీ కొట్టడఁవేఁటండీ?"

"అలాకూ్కఁడా ఆపుతూ ఉంటుందోయ్. అప్పుడప్పుడూ!... ఏముంది. ఆ క్లబ్బులంటపోవడం- మగాళ్ళతో సమంగా కార్డ్సూ, డ్రింక్సూ వ్యవహారం, ఎవణ్ణో ఒహాణ్ని వెర్రెత్తించి వేలిచుట్టూ తిప్పుకోవడం, వాడు గేటు దాకా వొచ్చి బెదిరిపోయి క్షమించమ్మా అనడం. లేకపోతే యేమిటి? ఈవిడ కిప్పుడు ముప్ఫయ్యేడో ముప్ఫయ్యెనిమిదో ఉంటాయా, వద్దెనిమిదేళ్ళదాన్లా ముస్తాబు చేసుకుని ముద్దులు కురుస్తుంది. అవి చూస్తే కొందరికి కడుపులోంచీ వికారం పుట్టుకొచ్చిందంటే, ఆశ్చర్యం ఏముంది?-"

"ఏమిటన్నారూ?-ఆవిడకి ముప్ఫయ్యేడేళ్ళా?- ఇరవయ్యారో ఇరవయ్యేడో ఉంటాయనుకుంటున్నాను."

"అనుకో, అనుకో! నీ కలా అనిపించడమే మంచిది! గుడ్‌లక్!!"

ం ం ం

వరల్డ్‌బైనైట్ సినిమా ఒచ్చింది టివోలీలోకి. అక్కడ ఆవిడ కారు ఆగివుంది, ఆవిడ కనిపించలేదు.. ఫస్ట్‌క్లాస్ క్యూలో నిలబడ్డాడు వ్యాసమూర్తి... కాళ్ళు క్యూలో ముందుకి ఒక్క వేపుమాత్రం కదులుతున్నా, కళ్ళు ఆవిడకోసం నాలుగు వేపులా వెతుకుతూనే ఉన్నాయి... మనస్సు ఆవిడ గురించి పరిపరివిధాల ఆలోచిస్తూనే ఉంది... సినిమాకొచ్చిందా? కూడా ఎవరొచ్చారో!....ఎవడో, ఆ అదృష్టవంతుడు, చూడాలి! దక్షిణామూర్తి చెప్పినట్టు దురదృష్టవంతుడేమో, ఒకవేళ! ఏ టిక్కెట్టో! రిజర్వుడు క్లాస్‌కి ఎడ్వాన్సుబుకింగు, బహుశా ఫోన్‌లోనే చేసేసుంటారు... వాళ్ళ పక్కనో, వెనకనో సీటు సంపాదించి కూర్చో గలిగితే కొంత బోధపడుతుందేమో... డబ్బులు చాలేటట్టు లేవు... "వన్ టికెట్ ప్లీజ్..." ఆ కొద్ది క్షణాలూ కౌంటర్లో తలా, కళ్ళూ పెట్టి యువతలపడి ఇటు చూసేసరికి, ఆదుగో ఆవిడ, ఇదిగో ఆవిడ లోకసమ్మోహనకరంగా వొదిలిన పైటచెంగు!...

"నమస్కారఁవఁండి-"

"నమస్కారం!- - సినీమా కొచ్చేవా?"

"అవునండి-" తన చేతులో టిక్కెట్టు తన క్లాసేమిటో మొహమాట పడుతూ చెప్పేసిన తర్వాత జేబులో పెట్టుకున్నాడు. "ఒక్కరే వొచ్చినట్టున్నారే-?"

"అవును...." కరుణాదేవి విలాసంగా నవ్వింది, "....ఒక్కర్తెనే రావడం చాలా ఏళ్ళ తరవాత మొదటిసారి....జడ్జిగారమ్మాయి....తార, ఒస్తానంది....పావు గంటనించి వెయిట్ చేస్తున్నాను....ఇప్పుడే ఫోన్ చేసేను....ఇంటి దగ్గిర మధ్యాన్నం మూడింటికే బయల్దేరిందట, కారు తీసుకుని....ఏ ఫ్రెండ్స్ యిళ్ళలో తిరుగుతుందో....?"

"వస్తారనుకుంటానండి....కార్లో కదా! ఏ క్షణం వచ్చినా రావచ్చు!"

"అఫ్‌కోర్స్....అయినా ఓ అరగంటకంటే ఎక్కువ చూడదల్చుకోలేదు...."

చూసి వెళ్ళిపోతుందనుకున్నాడు వ్యాసమూర్తి....కాని ఆట మొదలెట్టిన యిరవై నిమిషాలకి గేట్ దగ్గిరుండే అతను— "ఎనీవన్ బై నేమ్ వ్యాసమూర్తీ—?" అంటూ వెతుక్కుంటూ తన దగ్గరకొచ్చి "ఎక్స్‌క్యూజ్మీసార్....మేడమ్ వాంట్స్‌యు...." అన్నాడు.

అవిడతో వెనక సీట్లో కూర్చుని కారులో వెళ్ళడంకోసం, తన రూమ్ దగ్గర డ్రాప్ చేయించుకోడం కోసం, తను తెచ్చిన సైకిల్ టివోలీ కాంపౌండ్ లోనే వొదిలిపెట్టి, పొద్దుటే రూపాయిన్నర అదనంగా చెల్లించి తెచ్చుకోడం కూడా, అన్నింటితోబాటు మరిచిపోడం కష్టం....

0 0 0

"ఎంతవరకూ ఒచ్చింది?" అంటూ దక్షిణామూర్తి రూమ్ కొచ్చేడు.

వ్యాసమూర్తి నవ్వేసి ఊరుకున్నాడు, ఎంత అడిగినా ఏం లేదన్నాడు.

"పోనీ, అంతవరకూ ఒచ్చింది గద!—ఇలాంటి విషయాల్లో నవ్వేసి ఏం లేదనడం సాధారణంగా ఎప్పుడు జరుగుతుందో నాకు తెలుసులేవోయ్."

దేవాంతకుడు....

"—రిలయబుల్ సర్కిల్స్‌లో రూమర్ ఒకటి బైలుదేరింది విన్నావా? —రాజారావుగారు ఫారిన్ వెళ్ళిపోతూ—అట్నుంచొచ్చే వేళకి డైవోర్స్‌కి సిద్ధంగా ఉండమని చెప్పి వెళ్ళేరుటోయ్, మీ దేవిగార్ని! లక్షకాదు, రెండైనా సరే, యిచ్చేసి సెటిల్ చెయ్యమని లాయర్ ముకుందంగారికి ఇన్‌స్ట్రక్షన్స్ యిచ్చేరుట....దేవిగారు బార్ మెంబర్సులో వో జూనియర్‌నో, లేక నీ లాగ లైఫ్‌లో కొత్తగా అడుగు పెడుతున్న బ్లూమింగ్ అండ్ బ్యూటిఫుల్ గాణ్ణో సెలక్ట్ చేసుకుంటుందని - రూమర్....మరి నీ ఛాన్సెస్ ఎంతవరకో!"

'..........'

"కాని ఒక్కటి మాత్రం జ్ఞాపకం పెట్టుకో. సర్వీస్ కమీషన్ పరీక్ష వ్రాసినట్టు కాదు. అక్కడ ఈవిడ రికమండేషన్ పనిచేసింది గాని ఇక్కడ ఎవడి రికమండేషనూ పనిచెయ్యదు...."

దక్షిణామూర్తి అలా వెళ్ళగానే మధురోహల్లో మజ్జనా లాడసాగాడు, వ్యాసమూర్తి—థియేటర్ పుస్తకం అలవోకగా తెరిచేడు. అది అతని అభిమాన పుస్తకం అయికూర్చుంది— సోమర్ సెట్ మాం ఆ పుస్తకాన్ని ముందుగానే వ్రాసేసినందుకు అతనికి మెత్తటికోపం ఒస్తూవుంటుంది—కొన్నిప్రకరణాలంటే దక్షిణామూర్తిమాటలకంటే యిష్టం—నడివయస్సు దాటిన మహిళ,బాధ్యతలుతెలిసిన భామ—బొత్తిగా కొత్తవా డొకడు తారసపడి, మాసినగడ్డంతో మంచమించి బుజమ్మీద వరకూ పెట్టిన కితకితలకి సమాధానం చెప్పలేక పోయింది. గౌరవనీయులూ, పెద్దలూ అయివుండి దాదాపు చిన్నతనంనుంచీ తనని ఆరాధిస్తూ వాంఛిస్తె, ఆయనకి చివరికి ఆరాధనే మిగిల్చింది. తనకింద పనిచేసేవాడు, డబ్బులోగాని. పలుకుబడిలో గాని, ఆఖరికి తానాడే నాటకాలు బోధపర్చు కోడంలోగాని—ఎందునా తనికి ఈడుగాని వాణ్నిపట్టేసి, సాక్షాత్తూ పునర్యౌవనం పొందింది—లోకం అంతా వొక నాటకరంగం, కాకపోతే వొక నర్తనశాల—దేనికీ టైమ్‌రావాలని రాదు;ఉండాలని ఉండదు. సమయం చూచుకునీ, సమయం కనిపెట్టి, సమయం మించిపోకముందు అన్ని పన్లూ పూర్తిచేసుకోవాలి—

ఈ విధంగా తక్కువ మగవాణ్ని యెంచుకోడం చరిత్ర ప్రసిద్ధంలాగే ఉంది—కారు డ్రైవర్లూ, కమతగాళ్ళూ, ఎకౌంటు గుమస్తాలూ కథా నాయకులు కావటం అప్పుడప్పుడు అవుతూనే ఉంది—ఇందులో ఏదో ఉంది:లేకపోతే చరిత్ర చర్విత చర్వణం చేసి ఈ సత్యాన్ని పునః. పునఃప్రతిష్ట చెయ్యడం జరగదు—

తను ఆవిడకంటె తక్కువవాడు కావడం—తన అనర్హత ఎలాగో, అర్హత అలాగే నేమో— ఈ అర్హతానర్హతల మధ్య ఆడంబరాల ఆవేదనల మధ్య, తను ఎలా ఉత్తీర్ణుడు కావడం?

4

ఏదెలా వున్నా దక్షిణామూర్తిగారు చెప్పింది నిజం — అనుకున్నాడు వ్యాసమూర్తి—ఈవిడ కెప్పుడూ ఒక మగవాడు పక్కన ఉండాలి—

అదృష్ట దేవతగానీ, దురదృష్ట దేవతేగానీ — ప్రేమ దేవత మాత్రం అవును....

మనుషుల్లో ఈ భావం ఎందుకు పుడుతుంది? దీనికి కారణం ఏమిటి; పరిధులెంతవరకు? తెలుసుకోడం వరకేగాని ఆచరణీయమైన నిర్ణయాలు చేసుకోడం కష్టం— ఏ వాగొస్తే దాంట్లో కొట్టుకుపోడం మనిషి లక్షణం— అంతకంటే మించితే మానవాతీతం, మొదట మానవులు; తరవాత, ఓపిక, తీరిక ఉంటే మానవాతీతులు—

పరిస్థితులూ, అవకాశాలూ కూడి రాకపోతే ఎలాగైనా కాలక్షేపం చేసెయ్యొచ్చును—అవకాశం అంటే అదొక పరీక్ష సమయమే—వినియోగించుకోవడమా; వ్యర్థం చేసుకోవడమా?

ఆవిడ తననిలా ఎందుకు ఆహ్వానించిందో? ఇది నిజంగా కాకతాళీయమా? అంతానా?

తను ఏంచేస్తే మంచిదో; ఏం చెయ్యకపోతే మంచిదిగాదో-?

* * *

ఇప్పుడావిడ ఏం చేస్తూందో!—

కనిపెట్టడం పెద్ద కష్టం గాదు. బాత్‌రూమ్‌కేసి వెళితే వరండా పక్కన ఆవిడ గదికొక పెద్ద-గాజు పలకల కిటికి ఉంది. ఆ కిటికీలోంచి సరిగ్గా మూసెయ్యని స్క్రీన్‌లోంచి, తిన్నగా ఆవిడ మంచం కనిపిస్తుంది.

ఆవిడ నిద్రపోడంలేదు.... పుస్తకం ఏదో కిందపడేసిన చప్పుడూ టీపాయ్ ఈడిస్తే అయ్యే బరబరా;చప్పుళ్ళు వినిపిస్తూనే ఉన్నాయి;అప్పుడప్పుడు—

ఆవిడ వుద్దేశమేమిటో—సుడిగాలికంటే విచ్చలవిడైన ఆవిడ చరిత్ర... ప్రేమికుల గురించి ఆవిడ ఉద్దేశాలు—కమ్ సెప్టెంబర్ దృశ్యాల సమక్షంలో ఆవిడ హర్షం. తన రూమ్‌లో ద్వయంపట్ల ఆవిడ సానుభూతి; టేంక్‌బండ్ మీద కనుపించిన జంటని గమనించినప్పటి ఆమెచర్య—ఇవి తనకి ప్రోత్సాహాన్నివ్వడానికేనా? చాలా యివి? వీటితో తను ముందుకు వెళ్ళవచ్చా?—ఇంతకంటే వివరంగా ఇంత సంస్కారం ఉన్నవారు చెప్పరేమో!—

ఏమో — తొందర పడకూడదు — దక్షిణామూర్తి చెప్పినట్లు తొందర పడితే వ్యవహారం బెడిసికొడుతుందేమో —

దక్షిణామూర్తి సిగ్గోసిరి.,, తొందరపడకపోతే...ఆవిడ అంతకన్నా తొందరపడదు....ఎవరూ తొందరపడకుండా కూచుంటే. అవకాశాలు మళ్ళీ వొస్తాయా? ... ఎలాగో పెటుక్కుని అవకాశం సృష్టించొచ్చుగాని — అవి వెలితిగా కృతకంగా ఉంటాయేమో...

ఇంక అట్టే టైమ్‌లేదు...

0 0 0

హాల్లో గడియారం ఒక గంట కొట్టింది. ఒంటి గంటా? అనుకుంటూ వాచి చూసుకున్నాడు వ్యాసమూర్తి. ఒకటిన్నర ... వ్యాసమూర్తి లేచాడు. లేచాడుగాని అతను నడవలేదు. అక్కడే నించున్నాడు; ధైర్యం చెయ్యలేక.

ఏం చేద్దామని? అని మనస్సు నిలవదీసి అడుగుతోంది ... ఏమో ... తెలియదని డబాయించి దాటేశాడు. ప్రశ్నని....అలాగే నిస్సత్తువ సహాయంతో నిర్ణయం వొకటి తీసుకొని ద్వారం వరకూ వెళ్ళి తలుపు తెరిచాడు.

ఎదురుగా కరుణాదేవి గది — తలుపు పూర్తిగా మూసిలేదు. రెండు తలుపుల మధ్య సన్నని సందు మిగిలిపోయి అందులోంచి వెల్తురు ఏటవాలుగా ఎటో వెళ్తోంది — ఆవిడ తలుపు తీసుంచడానికి కారణమేమిటో — అని ధైర్యం చెప్పుకున్నాడు వ్యాసమూర్తి.

సరిగ్గా అదే సమయానికి కరుణాదేవి గది తలుపులు తెరుచుకున్నాయి. తెల్లని చీర కట్టుకున్న కరుణాదేవి ఒక్క నిమిషం ద్వారాని కడ్డంగా నిల్చుంది.

"నే ననుకున్నది నిజం —" అనుకున్నాడు వ్యాసమూర్తి.

చీకటి పల్చగా, మెత్తగా, అందంగా వుంది —

వ్యాసమూర్తి ఒక్కడుగు ముందుకు, వేసిఆవిడ వేపు చూశాడు.

కరుణాదేవి ఠక్కున హాల్లో నాలుగు దీపాల స్విచ్ వేసింది. హాలంతా వెల్తురుమయమైంది — హఠాత్తుగా వొచ్చిన వెల్తుర్లో ఆమె మొహం చూడ్డానికి వ్యాసమూర్తి ధైర్యం చెయ్యలేదు, వెల్తురు చూడలేక కళ్ళూ, ఆవిణ్ని చూడలేక మనసూ, మిలమిల్లాడేయి. ఆ భయంలో, ఆ కంగారులో "నేను నేను —" అనకుండా నిలదొక్కుకున్నందుకు ఆనందించ వలసొచ్చింది.

చిరునవ్వుతో కరుణాదేవి పలకరించింది "నీకూ నిద్రపట్టలేదా?"

'లేదండీ' అన్న మాట కూడా నోటంట పెగల్లేదు. వ్యాసమూర్తికి.

"నీకు శ్రమ యిస్తున్నందు కేమీ అనుకోకపోతే — నాకో చిన్న ఉపకారం చేసిపెట్టాలి —"

"ఓ! తప్పకుండా!"

"—క్రిందని, బోట్ హౌస్‌లో డ్రైవరు పడుకొని నిద్రపోతూవుంటాడు వరండాలో బజ్ నొక్కితే అతను లేచొస్తాడు. కారు తీసుకుని సిటీలోకి వెళ్ళి, నాకో బ్రాందీ బాటిల్ తెచ్చిపెట్టాలి—మేము ఎప్పుడూ తెచ్చుకునే బార్ వాళ్ళకి చీటీ రాసిస్తాను, ఓ అరడజను స్లీపింగ్ టాబ్స్‌కూడా యిస్తాడు. తెచ్చిపెట్టు—లేకపోతే ఇవాళ ఇహ నిద్రపట్టేటట్టులేదు. ఈ అర్థరాత్రివూట ఆ డ్రైవర్ని లెమ్మంటే ఏడుస్తాడుగాని చేసేదేం లేదు—ఇంత నీరసంలో నేను డ్రైవ్ చెయ్యలేను—"

"డ్రైవర్ విసుక్కుంటే నేను డ్రైవ్‌చేసుకు వెళ్తానండి—నాకేం నీరసం లేదు, నిద్రమత్తూ లేదు" అన్నాడు వ్యాసమూర్తి.

"వండర్‌ఫుల్, నీకు డ్రైవింగ్‌కూడా వచ్చా? చెప్పేవేకాదు. అలాంటప్పుడు ఆ డ్రైవర్ని లేపడం, వాడు విసుక్కోడం, సరేలే అంటూనువ్వెళ్ళడం అనోసెందుకు—? తిన్నగా షెడ్లో కారు తీసుకుని నువ్వే వెళ్ళొస్తే బావుంటుంది."

"నా ఉద్దేశం కూడా అదేనండి."

రెండు నిమిషాల్లో ఒక చీటీ, కారు తాళాలూ తెచ్చి యిచ్చింది కరుణాదేవి "—ఈ బార్ తెలుసా?" అంది,

"తెలుసు."

* * *

ఉదయం ఎనిమిదిన్నరైంది.

వ్యాసమూర్తి, దక్షిణామూర్తిదగ్గిర కెళదామని డ్రెస్ చేసుకున్నాడు, రూమ్‌కు తాళం పెట్టాడు.

క్రింద కారాగిన చప్పుడైంది.

చకచకా మేడమెట్లు దిగి వొచ్చేశాడు వ్యాసమూర్తి.

కారు హనుమంతరావుగారిది. డ్రైవరు నమస్కారంచేసి చీటీ ఇచ్చాడు.

"గొప్ప ప్రమాదం జరిగింది. ఉన్నపళంగా బైలుదేరిరా—హనుమంతరావు."

"ఏమైంది?"

"తెలీదుబాబూ."

కారెక్కాడు వ్యాసమూర్తి. "పద"

ం ం ం

పోర్టికోలో కారాగింది—హనుమంతరావుగారక్కడే సిద్ధంగా ఉన్నాడు.

"పంతులూ నువ్వు దిగిపో—"

"చిత్తం."

"ఫ్రంట్ సీట్లోకి రా, మూర్తీ!" అని హనుమంతరావుగారు కారెక్కి స్టార్టుచేశాడు.

—కారు కాంపౌండ్ దాటి వెళ్తోంది.

"రాత్రేమైంది మూర్తీ?"

వ్యాసమూర్తికి షాక్ తగిలినట్లయింది, తెల్లమొహం వేశాడు. కరుణాదేవి ఇంటిదగ్గిర ఏమైందని అడుగుతున్నారని తెలిసింది.

"టైమ్ వేస్టుచెయ్యకు—ఫరవాలేదు, చెప్పు."

"సాయంత్రం ఆవిడ మా ఆఫీస్ కొచ్చేశారండి. ఇద్దరం కలిసి సికింద్రాబాద్ వెళ్ళి ఆ ఫర్నిచర్ కంపెనీ ఆయన్తో మాట్లాదామండి, లేటైపోయిందండి. తాజ్‌లో భోంచేసి రెండో ఆటకి ఇంగ్లీష్ పిక్చరుకు వెళదాం అన్నారండి—సినిమా నుంచొచ్చి బంగళాలో గెస్టురూమ్‌లో పడుకున్నానండి. పొద్దుటే ఒచ్చేశానండి—" అని వ్యాసమూర్తి ఆయనవేపు చూశాడు.

ఆయన నమ్మలేదు, వ్యాసమూర్తి కళ్ళలోకి లోతుగా చూస్తూ "—నిన్ను అర్ధరాత్రప్పుడు ఊళ్ళోకి పంపిందటగా!" అన్నాడు.

"—అవునండి—రాత్రి ఒంటి గంటన్నరకి—బాత్రూమ్ కేసి వెళదామని లేచానండి—'నిద్దర పట్టట్లేదు. ఒక బ్రాందీ బాటిలూ అరడజను స్లీపింగ్ టాబ్లెట్సూ తెచ్చిపెట్టమని—బార్ మేనేజర్‌కి లెటర్ రాసిచ్చారండీ. కారు తీసుకునీ వెళ్ళొచ్చానండి—' ఇక్కడ పెట్టిపో, నేను స్లీపింగ్ డోస్ వేసుకుంటాను, లేచేసరికి లేటవుతుంది: నువ్వు లేవగానే రాజ్యలక్ష్మి నడిగి కాఫీ తీసుకుని, డ్రైవర్ని కారులో నీ రూమ్ దగ్గిర డ్రాప్ చెయ్యమను—' అనేసి తలుపేసుకున్నారండి—"

"అంతేనా?"

"అంతేనండి"

హనుమంతరావుగారు వ్యాసమూర్తిని మరొకసారి తీక్షణంగా చూశాడు. వెంటనే చూపు రోడ్డుమీదికి మళ్ళించేడు. స్టీరింగ్‌వీల్ మీద ఏదో పాటకితాళం వేసినట్లు వేళ్ళతో కొట్టసాగాడు.

"ఏమైందండీ? ఏదో ప్రమాదమని వ్రాసేరు!—" అన్నాడు వ్యాసమూర్తి.

హనుమంతరావుగారు అతని కళ్ళల్లోకి కటువుగా చూసేడు—మళ్ళీ

చూపు తిప్పేసుకుని ఐదు సెకండ్లు నిశ్శబ్దంగా ఊరుకున్నాడు. "కరుణాదేవి చచ్చిపోయిందోయ్."

"ఆఁ!—" వ్యాసమూర్తి కంగారుపడి సీట్లో సగానికి లేచాడు.

"—నా ఉద్దేశ్యం ఏమిటంటే—నువ్వు జరిగిందంతా చెప్పావా?"

వ్యాసమూర్తి వొణికిపోతున్నాడు. "అవునండీ—అంతా—చెప్పానండి"

"భయపడిపోకు—భయపడి అబద్ధం చెప్పడంకన్నా ధైర్యంగా నిజం చెప్పడం మంచిది—"

"నే....నే....నిజమే చెప్పేనండీ,"

"అయితే ధైర్యంగా ఉండు....ఆవిడెవరు, నువ్వెవరు, నేనెవరు!....కాని, నువ్వూ నేనూ కలిసి ఆవిణ్ని హత్య చేశామేమో అని—కనీసం నేను, ఆవిణ్ని చావకుండా ఆపేవాణ్ణనుకుంటాను—రాత్రి రెండు గంటలప్పుడు ఫోన్ చేసిందోయ్ 'గొప్ప ఆపదలో వున్నాను: రక్షించండి—' అంది.

"ఏవో హిస్టిరిక్ షాక్స్ తగుల్తూనే ఉంటాయి ఆవిడకి.—కొన్ని వందల మంది ఫ్రెండ్సు: కొన్నివేల యిన్సిడెంట్సు—అన్నీ దాదాపు ఎడ్వెంచర్సే. ఏది జ్ఞాపకంవొచ్చి బాధపడుతోందో, వొంటరిగా ఉంది! అనుకున్నాను.

"చెప్పు— అన్నాను.

"రక్షించండి! వెంటనే రండి—అంది.

"దొంగలా, దొరలా— అన్నాను.

"ఎవరూకాదు.... ఓ చిన్న అబ్బాయి.... నన్ను ప్రేమిస్తున్నానంటాడు. నాకు చాలా నీరసంగా ఉంది. అతన్ని ఊళ్ళోకి పంపేను. అతను తిరిగి రాక ముందు మీరురావాలి.లేకపోతే యేం జరుగుతుందోచెప్పలేను"—అంది,

"ఏమయినా బలప్రయోగం చేస్తున్నారా?"—అన్నాను.

'ఛీఛీ, వాడి మొహం!— ఇంకా ప్రారంభంలో ఉన్నాడు....అసలు ఇవాళే మొదలు, వాడి బుర్ర యిది ఆలోచించడం, అనుకుంటాను.ప్రస్తుతానికి అరడజను పేజీల ప్రేమలేఖ రాశాడు. ఆఫ్‌కోర్స్— అతనివ్వకుండానే ఆ బహుమతి స్వీకరించాను' అని పక పకా నవ్వింది. 'మీరు వెంటనే బయలుదేరి వొచ్చెయ్యండి!—' అంది

వాడెవడు?—అని నే నడగలేదు. అలా అడగడం మర్యాద కాదు. ఆవిడ చెప్పనూలేదు.

"సరే, నీరసంగా ఉందంటున్నావు గనక, ఇంట్లో బ్రాందీ ఉంటే కొట్టెయ్యి. బలప్రయోగం లేదంటున్నావు గనక, తలుపులు బిడాయించుకు హాయిగా నిద్రపో పొద్దుటే, ఒస్తాను: అబ్బాయిని మాత్రం వీలైతే దాచిపెట్టు: చూడాలనుంది'—అన్నాను,

'తరవాతేమైంది,మూర్తీ?—ఆ అబ్బాయి, నువ్వేగా!'

వ్యాసమూర్తి పెదవులు వొణికాయి'....నె...న్నే-నే—నండి....కాని నే నబద్ధాలాశ్నేదండి....నేను సిటీలోంచొచ్చాక ఆవిడ నామొహంవైనాచూశ్నేదండి, బాటిలూ పిల్చూ అందివ్వబోతే అందుకోలేదండి అక్కడ పెట్టిపో—అన్నారండి. నా వెనకే తలుపు గడియేసుకొన్నారండి' అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఉద్యోగంకోసం ఆవిడ సాయం ఆపేక్షించడం, ఆవిడిచ్చిన మర్యాదా, దక్షిణామూర్తి వ్యాఖ్యానాలూ, తన చర్యలూ, ఆలోచనలు, తన మూలంగా ఆవిడ మానసిక ఆందోళన పొందడం, మరణించడం—అన్నీ తెలిసిపోతూ, మిశ్రితభావాలు అందజేస్తూ అతణ్ణి కలచివేశాయి.పశ్చాత్తాపానిక్కూడా వ్యవధి అర్హతా లేనట్టయి పోయాడు. భయంలో కొట్టుకుంటున్నాడు.

మరి కొంతసేపు హనుమంతరావుగారు నిశ్శబ్దంగా ఉండిపోతే వ్యాసమూర్తి తన భయాన్ని దాచటానికి ప్రయత్నిస్తూ సంభాషణ మొదలు పెట్టి ప్రతీ అక్షరంతోనూ వ్యక్తం చేసేవాడే. కాని 'కరుణావిల్లా' దగ్గర పడగానే ఆయన '.... ఆ వుత్తరం ఏదో-నీ దగ్గరుందా?' అన్నాడు.

'లేదండి. అట్నుంచొచ్చేక నే నెంత వెతికినా కనిపించలేదండి.'

హనుమంతరావుగారు వ్యాసమూర్తి వేపు చూశాడు. 'కళ్ళు తుడుచుకో' అన్నాడు.

కారు కరుణావిల్లా ఆవరణలో ప్రవేశించింది.

○ ○ ○ ○

హనుమంతరావుగారు దిగగానే అక్కడ కూర్చున్న రాజ్యలక్ష్మి, కారు డ్రైవరూ లేచి నమస్కారాలు పెట్టారు. డ్రైవర్ని చేత్తో పిల్చి, "కారు తీసుకు వెళ్లు. అమ్మగార్ని పెద్దమ్మాయిగార్ని తీసుకురా!....పోలీసులకి ఫోన్ చేశావా?' అన్నాడు హనుమంతరావుగారు.

'లేదండీ—తమరొచ్చేక—'

'దట్స్ రైట్. పోనీలే: నేను చేస్తాను—నువ్వు తొందరగా వెళ్ళు—రాజ్యలక్ష్మి పద'

రాజ్యలక్ష్మి, వ్యాసమూర్తి ఆయనవెంట కరుణాదేవి గదివేపు వెళ్ళారు.

మంచంమీద, దన్నపిల్లో మీద, సౌందర్యం, స్వేచ్ఛ శాశ్వత నిద్రపోతు. న్నాయి.... వ్యాసమూర్తి హనుమంతరావుగారివేపే పొకసారిచూసి, ఆయనంత న్యూట్రల్‌గా ఎలా చూస్తున్నాడా అని ఆశ్చర్యపోతూ. ఇంత త్వరగా అంత చలాకీ అయిన మనిషి జ్ఞాపకాల పొగుగా మిగిలిపోయి జ్యోతి ఆరిపోయినందుకు భయపడిపోయి, దుఃఖాన్ని తుడుచుకుంటున్నాడు.

ం ం ం ం

మూడు ఉత్తరాలు దొరికాయి. తలగడ క్రింద.

ఒకటి రాజారావు గారికి, సీల్డుకవరు, పెద్దది: బరువైంది.

రెండోది హనుమంతరావు గారికి, అంటించని కవరు.

మూడోది పోలీస్ కమీషనరుకు. కాగితం మడత.

హనుమంతరావుగారు ముందుగా కవరులేని కాగితం మడత విప్పి చదివేశాడు. కేవలం ఆత్మహత్యేననీ, కారణాలు చాలా ఆధ్యాత్మికమైనవనీ ఎవరికీ ఎలాంటి సంబంధంలేదనీ, సమ్మతిపూర్వకంగా స్పష్టంచేసినట్లు వ్రాసింది. అది చూచి తేలికపడి నిట్టూర్పు నిడిచాడు.

* * *

హనుమంతరావుగారూ,

ఆఖరు నమస్కారం.

రాజారావుగారు అమెరికా వెళుతూ, కొడుకులు తన నంత దూరానికి రప్పించుకుంటున్నందుకు నొచ్చుకుంటూ, తన ఆపేక్ష అనే బలహీనతకీ, నా అసమర్థతకీ సిగ్గుపడుతూ మనకోసం, ఈ దేశంలో వుండి పోగలిగిన కొడుకు నొకణ్ణి నే తిరిగొచ్చే వేళకి చూడమంటే— తల్లీ తండ్రీలేని వాణ్ని, బుద్ధీ జ్ఞానం ఉన్నవాణ్ని, ఉగ్గూపాలూ అక్కర్లేనివాణ్ని, అండా దండా కావల్సిన వాణ్ణి—చూశాననీ, ఆయన చూస్తె తప్పకుండా మెచ్చుకుంటారనీ తెచ్చుకుంటారనీ, వారికి తెలియచేశాను.

వాడు నా కొడుకే. లేకపోతే నాకు వాడిమీద పుత్రప్రేమ ఎందుకక్కలుగుతుంది?

నా దృష్టి ఎప్పుడూ దెబ్బతినదు.... వాడు నిశ్చయంగా నా కొడుకే. ఇర వై రెండేళ్ళనాడు, పిఠాపురంలోని ఒక ధనవంతుడు నన్ను వైజాగ్‌లో కాలేజీలో చేర్చి, నా యోగక్షేమాలూ, సుఖ సౌఖ్యాలూ స్వయంగా వచ్చి విచారిస్తూ వుండిన రోజుల్లో, ఏదో నర్సింగ్ హోమ్‌లో నా బిడ్డగా జన్మించికూడా, నాకు గాని వారికిగాని అ బిడ్డను పెంచే సాహసం, అదృష్టం లేక: అయిదువేల రూపాయలతో తల్లి దండ్రుల్ని కొనుక్కున్న నెలతక్కువ బిడ్డ.... ఎప్పటికేనా తెలుసుకుంటాననీ, మళ్ళీ చూస్తాననీ ఆశించలేదు. పుట్టుమచ్చలూ వొంకర్లూ ఏమీ గుర్తులేవు....అయినా మాత్రం నా దృష్టి దెబ్బతినదు........ పేరు పెట్టిన వారెవరో, పాలు పోసిన వారెవరో.

పోతపాలతో, ఎర్రువు భావాల్తో పెరిగాడు గనకే, ఇలా బెడిసికొట్టింది. అమ్మెవరో, అతనెవరో తెలుసుకోలేకపోయిన మూర్ఖుడు.

జీవితాన్ని తిరగరాని వంపులుతిప్పి, అన్న, తమ్ముడు, తండ్రి, కొడుకు, ఇలాంటి బంధువులు లేకుండా చేసేసుకున్నాడు. నన్ను చూస్తె అందరికీ వొక్కలాంటి భావం కలిగితే అది నా తప్పుగాక, వారందరిదీనా?....నా తప్పులన్నీ వొక రూపంపొంది; నా జీవితంలో ఉన్న పొరపాటును ఎత్తి చూపించడానికి నా కొడుకును వినియోగించడం సిగ్గు పడవలసిన విషయం.....నాకు ప్రేమలేఖ వ్రాసిన అతన్ని మందలించడానికిగాని, ఇలాంటి కుమారుణ్ని రాజారావుగారికి స్వీకరించ మనడానికీ—అన్నిటికీ మించి మొట్టమొదటే నా భావం నా కుమారుడికి తెలియజేయక పోయినందుకు సిగ్గు పడ్డానికిగాని నా కోపికలేదు. ఈ సమయంలో, నే నుంటే. పరిస్థితులో మనుష్యులో నా కనేక కర్తవ్యాలు నిర్దేశించడం జరుగుతుంది. నాకు తోచిన మార్గాన నేను పోవడానికి ఇదే అవకాశం.

సెలవు.

కరుణ.

తా, క— ఈ ఉత్తరంలో ఒక సీల్డు కవరూ, పోలీసులకొక ఉత్తరమూ ఉన్నాయి, ఎవరిది వారి కందజేసే బాధ్యత మీ కొప్పగిస్తున్నాను. వారి ఉత్తరంతప్ప మిగతాదేదీ పోలీసులకిచ్చి నా కొడుకు బ్రతుకు పాడుచెయ్యవద్దని నా కడసారి ప్రార్థన.

0)0(0